51 అంగుళాల బాల రాముడు

అయోధ్య గర్భగుడిలో కొలువుదీరే విగ్రహాన్ని ఎంపిక చేసిన ఆలయ ట్రస్ట్!

వచ్చే నెల 22న విగ్రహ ప్రతిష్ఠ.. 35 అడుగుల దూరం నుంచి భక్తులకు దర్శనం

అయోధ్య, డిసెంబర్ 29: అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి శరవేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. గర్భగుడిలో ఏ విగ్రహం ప్రతిష్ఠిస్తారనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. ప్రతిష్ఠాపన కోసం మొత్తం మూడు విగ్రహాలను తయారు చేయగా.. వాటి లోంచి ఓ విగ్రహాన్ని ఎంపిక చేసినట్టు సమాచారం. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మౌఖిక ఓటింగ్ ద్వారా ఓ విగ్రహాన్ని ఎంపిక చేసినట్టు తెలిసింది. 51 అంగుళాల ఎత్తుతో ఐదేండ్ల బాలుడి రూపంలో విగ్రహం ఉండనుంది. 35 అడుగుల దూరం నుంచి భక్తులు దర్శించుకోవచ్చు. వచ్చే నెల 22న విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. విల్లంబులు ధరించి, కమలంపై కూర్చొని ఉండే బాల రాముడి విగ్రహాలను ముగ్గురు శిల్పులు వేర్వేరుగా రూపొందించారు. అందులోంచి ఒక దానిని తాజాగా ఎంపిక చేశారు. అయితే విగ్రహం ఎంపిక పూర్తయిన ప్పటికీ దీనిపై పలువురి అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాతే దాని రూపాన్ని బాహ్య ప్రపంచానికి వెల్లడిస్తారని ఆలయ వర్గాలు తెలిపాయి. కాగా, ఇప్పటివరకు ఉన్న పాత విగ్రహాన్ని అచల మూర్తిగా వ్యవహరిస్తుండగా, కొత్త విగ్రహాన్ని ఉత్సవమూర్తిగా పిలుస్తారు.



శుక్రవారం అయోధ్య రామాలయం వద్ద ముమ్మరంగా సాగుతున్న నిర్మాణ పనులు

అయోధ్యలో వారం పాటు కార్యక్రమాలు

అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు రామ్ మందిర్ ట్రస్టు అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. జనవరి 22న రామ్‌లాలా (బాల రాముడి విగ్రహం) విగ్రహాన్ని రామమందిరంలో ప్రతిష్ఠించేందుకు ఏడు రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నది. ఈ కార్యక్రమాలు జనవరి 16న ప్రారంభమై, ప్రతిష్ఠాపన జరిగే వరకు కొనసాగుతాయి. ఏయే రోజు ఏయే కార్యక్రమం నిర్వహిస్తున్నదీ వివరాలతో ట్రస్టు ప్రకటన విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ హాజరుకానున్నారు. ఆయన తన పర్యటనలో భాగంగా అయోధ్యలో రూ.15 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభిస్తారు.

కార్యక్రమాలివే

- **జనవరి 16:** వేద పండితులతో సర్వ ప్రాయశ్చిత్ హోమం, దశవిద్ స్నానం
- **జనవరి 17:** అయోధ్యలో రామ్ లల్లా విగ్రహంతో ఊరేగింపు
- **జనవరి 18:** గణేశ్ అంబికా, వరుణ, వాస్తు తదితర పూజా కార్యక్రమాలు
- **జనవరి 19:** అగ్ని స్థాపన, నవగ్రహ స్థాపన
- **జనవరి 20:** సరయూ నది పవిత్ర జలంతో ఆలయ గర్భగుడి సంప్రోక్షణ
- **జనవరి 21:** 125 కలశాలతో దివ్య స్నానం
- **జనవరి 22:** రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

పీవోకే నుంచి పవిత్ర జలం

అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి పవిత్ర జలం రానున్నది. పీవోకేలోని శారద పీఠం ఆలయ ప్రాంగణంలోని సరస్సు నుంచి ఈ జలాన్ని సేవ్ శారద కమిటీ-కశ్మీర్ బృందం తీసుకురానున్నది.

అయోధ్య రామాలయంలో అద్భుతమైన కళాకృతితో నిర్మితమైన కట్టడం

శ్రీరామ హారతి ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం

అయోధ్య, డిసెంబర్ 29: అయోధ్య రామాలయం వచ్చే ఏడాది జనవరి 22న ప్రారంభమవుతుంది. అయితే రామాలయంలో ప్రాణప్రతిష్ఠకు ముందు రోజు దేవాలయంలో శ్రీరాముని హారతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనాలనుకునే వారికి ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభమైంది. భక్తులు రామజన్మభూమి ఆలయ వెబ్‌సైట్‌లో ముందుగా తమ పేరు, వివరాలు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేసిన తర్వాత అయోధ్యలోని ఆలయ కౌంటర్‌లో పాస్‌లు తీసుకోవాలి. భక్తులు తమ ఐడెంటిటీ ప్రూఫ్ కింద ఆధార్, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ సమర్పించవచ్చు. రోజుకు మూడుసార్లు మాత్రమే జరిగే ఈ హారతిలో గరిష్ఠంగా 30 మంది మాత్రమే పాల్గొనవచ్చు.

జనవరి 1 నాటికి 800 కోట్లు దాటనున్న ప్రపంచ జనాభా

వాషింగ్టన్, డిసెంబర్ 29: ఈ ఏడాది ప్రపంచ జనాభా 7.5 కోట్లు పెరిగిందని, జనవరి 1 నాటికి అది 800 కోట్లకు చేరుకుంటుందని యూఎస్ సెన్సస్ బ్యూరో గురువారం వెల్లడించింది. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా జనాభా వృద్ధి రేటు 1 శాతం లోపేనని, అదే అమెరికాలో 0.53 శాతమని తెలిపింది. 2024 ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా ప్రతి సెకనుకు 4.3 పుట్టుకలు, రెండు చావులు సంభవిస్తాయని చెప్పింది. అదే అమెరికాలో ప్రతి 9 సెకన్లకు ఒక జననం, ప్రతి 9.5 సెకన్లకు ఒక మరణం సంభవిస్తుందని తెలిపింది. అమెరికా చరిత్రలో 2020 దశాబ్దం అతి నిదానంగా 4 శాతం లోపే జనాభా వృద్ధి నమోదు చేసిన దశాబ్దంగా నిలిచిపోనుందని ది బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్ వెల్లడించింది.

పొత్తులపై కాంగ్రెస్‌కు శివసేన ఝలక్

ముంబై: రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం పొత్తుల విషయంలో చర్చలను కాంగ్రెస్ సున్నా నుంచి ప్రారంభించాలని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ చెప్పారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ కనీసం ఒక స్థానాన్నైనా గెల్చుకోలేదన్నారు. మహారాష్ట్రలోని 48 లోక్‌సభ నియోజకవర్గాల్లో 23 స్థానాలతోపాటు, దాద్రా నగర్ హవేలీ స్థానం నుంచి కూడా తమ పార్టీ పోటీ చేస్తుందని చెప్పారు. సంజయ్ రౌత్ వ్యాఖ్యలపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శివసేన ఎంపీల్లో అత్యధికులు ప్రస్తుతం షిండే వర్గంలో ఉన్నారని, కూటమిలో అతి పెద్ద పార్టీ కాంగ్రెసేనని చెప్పారు.

నటి జయప్రద కనిపించడం లేదు

కోర్టుకు హాజరుకాని బీజేపీ నేత.. వెతుకుతున్న పోలీసులు

రామ్‌పూర్, డిసెంబర్ 29: బీజేపీ నాయకురాలు, నటి జయప్రద కోసం ఉత్తరప్రదేశ్ పోలీసులు తెగ వెతుకుతున్నారు. 2019లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన రెండు కేసుల్లో ఆమె నిందితురాలిగా ఉన్నారు. విచారణకు హాజరు కావాలని పలుమార్లు జడ్జి ఆదేశించినా ఆమె హాజరు కాలేదు. దీంతో జడ్జీ ఆమెపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. జనవరి 10లోగా ఆమెను తన ముందు ప్రవేశపెట్టాలని పోలీసులను ఆదేశించారు. దీంతో రామ్‌పూర్ ఎస్పీ ఆమెను వెతకడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆ బృందం కూడా ఆమె ఆచూకీని కనిపెట్టలేకపోయింది. ఏప్రిల్ 19, 2019న జయప్రద ఎన్నికల నియమావళికి విరుద్ధంగా యూపీలోని స్వర్ ప్రాంతంలో ఉన్న నూర్‌పూర్ గ్రామంలో రోడ్డును ప్రారంభించారు. పిప్లియా మిశ్రా గ్రామంలో జరిగిన బహిరంగ సభలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు.

ఉల్ఫాతో శాంతి ఒప్పందం

- **సంతకాలు చేసిన కేంద్రం, అస్సాం ప్రభుత్వం**

న్యూఢిల్లీ, డిసెంబర్ 29: అస్సాంలోని మిలిటెంట్ సంస్థ 'యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం' (ఉల్ఫా)తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి ఒప్పందం చేసుకున్నాయి. ఆ రాష్ట్ర చరిత్రలోనే ఇది ఓ కీలక ఘట్టంగా నిలిచిపోనున్నది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ అస్సాం ప్రజలకు ఈ రోజు మరిచిపోని రోజు అని చెప్పారు. 'ఉల్ఫా హింస వల్ల అస్సాం ప్రజలు సుదీర్ఘకాలం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 10,000 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. కానీ ఇప్పుడు ఉల్ఫాతో ఇబ్బందులు ఉండవు. ఇకపై వారంతా ప్రజాస్వామ్య వాదులే' అని అమిత్ షా పేర్కొన్నారు. కాగా, అస్సాంలో శాంతిస్థాపనకు కృషి చేయడం, అక్రమ వలసలను అడ్డుకోవడం, భూ హక్కులు లేని కొన్ని స్థానిక సామాజికవర్గాలకు హక్కులు కల్పించడం, అస్సాం అభివృద్ధికి ఆర్థిక ప్యాకేజీ ఇలా పలు అంశాలను శాంతి ఒప్పందానికి ప్రాతిపదికగా తీసుకున్నారు.

- **లీకవుతున్న పెట్రోల్ కోసం వెళ్లి..**

లైబీరియాలో ఓ పెట్రోల్ ట్యాంకర్ పేలి 40 మంది పౌరులు దుర్మరణం చెందారు. ట్యాంకర్ నుంచి లీకవుతున్న పెట్రోల్‌ను పట్టుకోవడానికి జనం గూమికూడినప్పుడు ఈ దుర్ఘటన జరిగింది. టొటొటా పట్టణంలో మంగళవారం జరిగిన ఈ ఘటనలో 85 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు.

దివ్యాంగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్

- **కేంద్ర ఉద్యోగులకు సర్కారు తీపి కబురు**
- **లోక్‌సభ ఎన్నికల ముంగిట కీలక నిర్ణయం**

న్యూఢిల్లీ, డిసెంబర్ 29: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కేంద్ర ప్రభుత్వం పరిధిలో పనిచేస్తున్న దివ్యాంగ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పిస్తున్నట్టు ప్రకటించింది. 2016, జూన్ 30వ తేదీ నుంచి ఈ రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపింది. 'కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న దివ్యాంగ ఉద్యోగుల్లో వారి అర్హతలను బట్టి కనీసం గ్రూప్-ఏ స్థాయి వరకు నోషనల్ విధానంలో ప్రమోషన్లలో రిజర్వేషన్ల కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది 2016, జూన్ 30 నుంచి అమలవుతుంది' అని అన్ని కేంద్ర ప్రభుత్వ విభాగాల కార్యదర్శులకు ప్రభుత్వం జారీచేసిన ఆదేశాల్లో పేర్కొన్నది. అయితే ప్రమోషన్లకు సంబంధించి ఆర్థిక ప్రయోజనాలు సదరు ఉద్యోగి ప్రమోషన్ పోస్టులో చేరిన రోజు నుంచి అమలవుతాయని తెలిపింది. అంటే నోషనల్ ప్రమోషన్ పొందిన తేదీ నుంచి నిజంగా ప్రమోషన్‌తో కొత్త పోస్టులో చేరేవరకు మధ్య గల కాలానికి సంబంధించి ఉద్యోగికి ఎలాంటి ప్రయోజనాలు అందవు. వివరంగా చెప్పాలంటే.. ఒక ఉద్యోగి 2016 జూన్ 30 నాటికే ప్రమోషన్లలో రిజర్వేషకు అర్హత కలిగి ఉంటే.. అప్పటి నుంచే అతనికి ప్రమోషన్ వచ్చినట్టు లెక్కగడతారు. కానీ, ప్రభుత్వం 2024 జనవరి 1న అతనికి ప్రమోషన్ ద్వారా కొత్త పోస్టు కేటాయించిందని అనుకొందాం. అతడు ఆ రోజే కొత్త పోస్టులో చార్జ్ తీసుకొంటే.. ఆ 2024 జనవరి 1 నుంచి మాత్రమే ప్రమోషన్‌కు సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి.

శారద ఆలయం

పీవోకేలో శారద ఆలయం ఆక్రమణ

- **నిర్మాణాలు చేపట్టిన పాక్ సైన్యం**
- **భారత ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి: శారద కమిటీ**

బెంగళూరు, డిసెంబర్ 29: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ప్రముఖ శారద ఆలయం పరిసరాలను పాకిస్థాన్ సైన్యం ఆక్రమించిందని సేవ్ శారద కమిటీ (ఎస్ఎస్‌సీ) వ్యవస్థాపకుడు రవీంద్ర పండిత చెప్పారు. ఆ స్థలంలో కాఫీ హోంని కూడా ఏర్పాటు చేసిందని తెలిపారు. శుక్రవారం ఆయన బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆక్రమణలను తొలగించడానికి భారత ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. 'వాస్తవానికి ఈ స్థలం విషయంలో ఎస్ఎస్‌సీకి అనుకూలంగా కోర్టు తీర్పు కూడా ఉన్నది. కానీ పాక్ సైన్యం మాత్రం స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నది. ఆలయ గోడలను ధ్వంసం చేస్తున్నది. దీన్ని వ్యతిరేకిస్తూ పోరాడుతున్నాం. పీవోకేలోని స్థానిక ప్రజలు కూడా మాకు మద్దతుగా నిలుస్తున్నారు. అయితే మా పోరాటానికి భారత ప్రభుత్వం మద్దతు కోరుతున్నాం. వెంటనే భారత ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆలయ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. శారద ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. వారసత్వ సంపద గుర్తింపునివ్వాలి' అని రవీంద్ర కోరారు.

హెచ్-1బీ ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజు పెంపు

వాషింగ్టన్: హెచ్-1బీ వీసా అప్లికేషన్ ప్రీమియం ప్రాసెసింగ్ రుసుమును 12 శాతం పెంచుతూ యూఎస్ సిటిజెన్‌షిప్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) నిర్ణయం తీసుకుంది. ఐ-129, ఐ-140, ఐ-539, ఐ-765 ఫామ్స్‌కు ఇది వర్తిస్తుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 26 నుంచి అమల్లోకి వస్తుంది. హెచ్-1బీ అప్లికేషన్ల ఈ-రిజిస్ట్రేషన్లు మార్చిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. తాజా రుసుము పెంపుతో నాన్-ఇమ్మిగ్రెంట్ వర్కర్ కోసం ఉద్దేశించే ఫాం ఐ-129 ఫాం ప్రాసెసింగ్ రుసుము 2,805 డాలర్లకు పెరగ్గా, అంతర్జాతీయ విద్యార్థులకు నిర్దేశించిన ఫాం ఐ-539 రుసుము 1,750 డాలర్ల నుంచి 1,965 డాలర్లకు పెరిగింది. ఉద్యోగార్థుల కోసం ఉద్దేశించిన ఫాం ఐ-765 ప్రాసెసింగ్ ఫీజు 1,685 డాలర్లకు పెరిగింది.

ఓపెన్‌ఏఐ, మైక్రోసాఫ్ట్‌పై న్యూయార్క్ టైమ్స్ దావా

వాషింగ్టన్ : మైక్రోసాఫ్ట్, ఓపెన్‌ఏఐలపై 'న్యూయార్క్ టైమ్స్' మీడియా సంస్థ చట్టపరమైన చర్యలను ప్రారంభించింది. తాను ప్రచురిస్తున్న లక్షలాది ఆర్టికల్స్‌ను ఈ రెండు కంపెనీలు అనధికారికంగా కాపీ చేసి, ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించింది. తన కంటెంట్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్ చాట్‌జీపీటీ (ఓపెన్ ఏఐ), కోపైలట్ (మైక్రోసాఫ్ట్)ల అభివృద్ధి కోసం వినియోగించుకుంటున్నాయని తెలిపింది. కోపైలట్, చాట్‌జీపీటీ వంటి మోడల్స్ మైక్రోసాఫ్ట్, ఓపెన్‌ఏఐ కంపెనీల సాంకేతిక సామర్థ్యాన్ని, మార్కెట్ పోటీని పెంచడానికి దోహదపడినట్లు తెలిపింది. ఈ మోడల్స్ వల్ల తమ సబ్‌స్క్రిప్షన్, లైసెన్సింగ్, అడ్వర్టయిజింగ్ ఆదాయం కోల్పోతున్నట్లు వివరించింది.

జేడీయూ అధ్యక్షుడిగా నితీశ్

న్యూఢిల్లీ: జేడీయూ నూతన జాతీయ అధ్యక్షుడిగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఇక్కడ జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గంలో ప్రస్తుత అధ్యక్షుడు లలన్ సింగ్ స్థానంలో నితీశ్‌ను ఎన్నుకున్నట్టు పార్టీ అధికార ప్రతినిధి కేసీ త్యాగి చెప్పారు.

ట్రంప్‌కు మరో షాక్

- **ప్రైమరీలో పోటీపడకుండా మైన్ రాష్ట్రం నిషేధం**

పోర్ట్‌ల్యాండ్ (అమెరికా), డిసెంబర్ 29: అమెరికా అధ్యక్ష పీఠాన్ని రెండోసారి కైవసం చేసుకోవాలని తహతహలాడుతున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అధ్యక్ష పదవికి ట్రంప్ అనర్హుడని ఇటీవల కొలరాడో సుప్రీంకోర్టు ప్రకటించి పట్టుమని 10 రోజులైనా గడవకముందే మరో రాష్ట్రం ఆయనకు షాక్ ఇచ్చింది. వచ్చే ఏడాది జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసేందుకు ట్రంప్ అనర్హుడని తాజాగా మైన్ రాష్ట్రం స్పష్టం చేసింది. కొలరాడో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత మైన్ రాష్ట్రంలో ట్రంప్ అభ్యర్థిత్వాన్ని కొందరు సవాలు చేశారు. వారి అప్పీళ్లను పరిగణనలోకి తీసుకున్న ఆ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి షెన్నా బెల్లోస్.. ప్రెసిడెన్షియల్ ప్రైమరీ బ్యాలెట్ నుంచి ట్రంప్ పేరును తొలగిస్తున్నట్టు గురువారం ప్రకటించారు. తద్వారా అమెరికా అధ్యక్ష పదవికి పోటీచేస్తున్న అభ్యర్థిపై ఏకపక్షంగా వేటువేసిన తొలి అధికారిగా ఆమె రికార్డులకు ఎక్కారు. కొలరాడో సుప్రీంకోర్టు తీర్పును సవాలు చేస్తూ రిపబ్లికన్ పార్టీ చేసుకున్న అప్పీలుపై నిర్ణయాన్ని ప్రకటించేందుకు అమెరికా సుప్రీంకోర్టు సిద్ధమవుతున్న తరుణంలో ఈ పరిణామం జరిగింది. అయితే, దీనిపై ట్రంప్ కోర్టును ఆశ్రయించేందుకు బెల్లోస్ అవకాశం కల్పించారు. అప్పటివరకు తన నిర్ణయం అమలును నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో బెల్లోస్ నిర్ణయాన్ని మైన్ కోర్టులో సవాలు చేయనున్నట్టు ట్రంప్ మద్దతుదారులు తెలిపారు. 2020 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమి అనంతరం ఆయన మద్దతుదారులు నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జో బైడెన్‌ను అడ్డుకునేందుకు 2021 జనవరి 6న యూఎస్ క్యాపిటల్‌పై దాడికి దిగిన విషయం విదితమే. వారిని సమర్థించి, హింసను ప్రేరేపించినట్టు ట్రంప్‌పై అభియోగాలున్నందున వచ్చే ఏడాది జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి ఆయన అనర్హుడని కొలరాడో సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టం చేసింది.

- **ఎరక్కపోయి.. ఇరుక్కుపోయింది**

ముంబై నుంచి అస్సాంకు తరలిస్తున్న ఓ విమానం శుక్రవారం బీహార్‌లోని మోతీహరిలోని పిప్రకోతి వంతెన కింద ఇరుక్కుపోయింది. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రక్ డ్రైవర్లు, స్థానికుల సాయంతో విమానం విరిగిపోయిన భాగాన్ని వేరు చేశారు.

10 రోజుల ఎంబీఏ క్రాష్ కోర్స్ బూటకం

- **తప్పదోవపట్టిస్తున్న ఇన్‌ఫ్లుయెన్సర్లు**
- **విద్యార్థులకు ఏఐసీటీఈ హెచ్చరిక**

న్యూఢిల్లీ: కొందరు మోటివేషనల్ స్పీకర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు 10 రోజుల ఎంబీఏ క్రాష్ కోర్స్ పేరుతో తప్పుదోవ పట్టిస్తున్నారని ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) విద్యార్థులను హెచ్చరించింది. ఏఐసీటీఈ విడుదల చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం, పీజీ డిగ్రీ రావడానికి ఉపయోగపడే ఎంబీఏ లేదా మేనేజ్‌మెంట్ కోర్సులతో సహా టెక్నికల్ కోర్సులను ఆఫర్ చేయాలంటే ఏఐసీటీఈ అనుమతి, ఆమోదం తప్పనిసరి. ఏఐసీటీఈ అనుమతి లేకుండా ఈ కోర్సులను సంస్థలు లేదా విశ్వవిద్యాలయాలు ఆఫర్ చేయకూడదు. ఎంబీఏ రెండేళ్ల వ్యవధిగల కోర్సు, దీనిని కేవలం 10 రోజుల్లో పూర్తి చేయడం సాధ్యం కాదు. ఇటువంటి మోసపూరిత ప్రకటనల బారిన పడవద్దని విద్యార్థులను ఏఐసీటీఈ కోరింది.

జాబిల్లి చిక్కె.. సూర్యుడు చేరువాయె

- ***ఈ ఏడాది స్ఫూర్తిదాయక విజయాలు***
- ***చంద్రయాన్-3, ఆదిత్య ఎల్1తో ఇస్రో రికార్డు***

న్యూఢిల్లీ, డిసెంబర్ 29: ఈ ఏడాది శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుత విజయాలు సాధించి కొత్త ఏడాదికి సరికొత్త బాటలు వేసుకుంది. చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 మిషన్లను ఇస్రో విజయవంతంగా ప్రయోగించి భారత విజయపతాకాన్ని వినువీధుల్లో రెపరెపలాడించింది. ఈ ఏడాది మనం సాధించిన విజయాలను ఓసారి చూద్దాం..

చంద్రుడిపై చెదరని సంతకం

ప్రపంచదేశాలు ఇంతకుమునుపెన్నడూ చేరని చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టి ఇస్రో ఈ ఏడాది సరికొత్త రికార్డు సృష్టించింది. చంద్రయాన్-3 మిషన్ ద్వారా విక్రమ్ ల్యాండర్‌ను విజయవంతంగా జాబిల్లి దక్షిణ ధ్రువంపై దించింది. అతి తక్కువ ఖర్చుతో ఇస్రో చేపట్టిన ఈ ప్రయోగం.. ప్రపంచ దేశాలను ఆశ్చర్యపోయేలా చేసింది. జాబిల్లిపై 14 రోజులపాటు విక్రమ్ పరిశోధనలు చేపట్టింది. చంద్రుడిపై ఆక్సిజన్‌తోపాటు ఇతర కీలక మూలకాల ఉనికిని గుర్తించింది.



సూర్యుడి రహస్యాల ఛేదనను ఆదిత్య ఎల్1

సూర్యుడి రహస్యాలను కనుక్కొనేందుకు సెప్టెంబర్ 2న ఈ ప్రయోగం చేపట్టారు. భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని ఎల్1 పాయింట్ వద్ద ఉన్న కక్ష్యలో వ్యోమనౌకను ప్రవేశపెట్టనున్నారు. అక్కడి నుంచి ఇది భానుడిపై పరిశోధనలు సాగించనున్నది. వచ్చే జనవరి 6న ఇది తన గమ్యస్థానాన్ని చేరుకుంటుందని ఇస్రో ప్రకటించింది.

కృత్రిమ మేధతో సంచలనాలు

కృత్రిమ మేధ సాయంతో ఐఐఎస్‌సీ రూపొందించిన విధానం ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తున్నది. ఐఐటీ జోధ్‌పూర్ సృష్టించిన ఏఐ ప్లాట్‌ఫామ్ మధుమేహ సంబంధ సమస్యల ప్రమాదాన్ని ముందుగానే నిరోధిస్తుంది. ఈ తరహా ఆవిష్కరణల వల్ల 2023లో 14.6 బిలియన్ డాలర్లుగా ఉన్న ఏఐ హెల్త్‌కేర్ మార్కెట్ 2028 నాటికి 102.7 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని నాస్కామ్ అంచనా వేసింది.



మరికొన్ని..

ఇవే కాకుండా అంతరిక్ష పరిశోధనల్లో అంతర్జాతీయ సహకారం కోసం భారత్ ఆర్టెమిస్ ఒప్పందంపై సంతకం చేసింది. దీని ద్వారా నాసా సాయంతో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు ఇస్రో భారత వ్యోమగామిని పంపనుంది. సౌర విద్యుత్తును అందుబాటు ధరల్లోకి తెచ్చేందుకు జాతీయ పునరుత్పాదక ఇంధన ప్రయోగశాల సోలార్ సెల్ టెక్నాలజీలో ప్రగతి సాధిస్తున్నది. మరోవైపు లిథియం-అయాన్ బ్యాటరీల జీవితకాలాన్ని, వేగంగా చార్జింగ్ అయ్యే అవకాశాలపై చెప్పుకోదగ్గ పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2023లో భారత శాస్త్రవేత్తలు సాధించిన మైలురాళ్లు 2024లో సాధించే సృజనాత్మక ఆవిష్కరణలకు పునాది రాళ్లు కానున్నాయి.

భగవద్గీత శ్లోకానికి తప్పుడు అనువాదం

- **అస్సాం సీఎం క్షమాపణ**

గువాహటి: భగవద్గీత శ్లోకాన్ని తప్పుగా అనువదించి, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినందుకు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ క్షమాపణ చెప్పారు. ఆయన ప్రతి రోజూ ఉదయం ఓ భగవద్గీత శ్లోకాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 668 శ్లోకాలను పోస్ట్ చేశారు. అయితే భగవద్గీతలోని 18వ అధ్యాయంలో ఉన్న 44వ శ్లోకానికి అర్థాన్ని తప్పుగా తన బృందం సభ్యులు అనువదించారని ఆయన తెలిపారు. ఈ పొరపాటును తాను గుర్తించిన వెంటనే దానిని సామాజిక మాధ్యమాల్లోని తన ఖాతాలన్నిటి నుంచి తొలగించినట్లు తెలిపారు. ఈ పోస్ట్ ఎవరినైనా బాధించి ఉంటే, తాను క్షమాపణ చెప్తున్నానని తెలిపారు.

ఆయన పోస్ట్‌లో ఏముందంటే...

వ్యవసాయం, గోవుల పెంపకం, వ్యాపారం వైశ్యులకు సహజ కర్తవ్యాలని, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు సేవ చేయడం శూద్రుల కర్తవ్యమని ఈ శ్లోకానికి అర్థం అని వివరించారు. వైశ్యులకు, శూద్రులకు సహజ విధులను భగవాన్ శ్రీకృష్ణుడు వివరించాడని తెలిపారు. అయితే ఆయన పోస్ట్‌ను ప్రతిపక్ష నేతలు తీవ్రంగా ఖండించారు. బీజేపీ మనువాద, తిరోగమన సిద్ధాంతాలను అనుసరిస్తున్నదని దుయ్యబట్టారు.

ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

కీవ్: ఉక్రెయిన్‌పై క్షిపణులు, డ్రోన్లతో రష్యా విరుచుకుపడింది. శుక్రవారం ఒక్కరోజే 122 క్షిపణులను, 36 డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో 27 మంది ప్రాణాలు కోల్పోయారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. 2022 ఫిబ్రవరి నుంచి జరుగుతున్న యుద్ధంలో ఇదే అతి పెద్ద గగనతల దాడి అని చెప్పారు. ఈ దాడిలో 87 క్షిపణులను, 27 డ్రోన్లను అడ్డుకున్నామని పేర్కొన్నారు. రష్యా విరుచుకుపడటంతో ఉక్రెయిన్ మిత్ర దేశాలను ఆశ్రయించింది.

సీఈసీ, ఈసీల బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకానికి సంబంధించిన బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. సీఈసీ, ఈసీల నియామకాల బిల్లుతో పాటు ప్రెస్, రిజిస్ట్రేషన్ ఆఫ్ పిరియాడికల్స్ బిల్లుకూ రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (రెండో సవరణ బిల్లు, 2023), తాత్కాలిక పన్నుల వసూలు బిల్లు, 2023కు ఆమె ఆమోదముద్ర వేశారు.